క్లుప్తంగా

'ఎస్వీసీసీ' విద్యార్థుల ప్రతిభ



వెంకట్, అక్షయ లక్ష్మీ, పల్లవి, గురుసాయి

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ విడుదల చేసిన బీకాం(కంప్యూటర్స్) రెండో సంవ త్సరం మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ నాగరాజ తెలిపారు. ఇందులో ఎస్.వెంకట్ 9.08, ఆర్.అఖిల 8.65, ఎస్.గురుసాయి 8.62, పి.అక్షయలక్ష్మీ 8.62, బీఎస్సీలో పి.పల్లవి 7.39 శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. కళాశాలలో మొత్తం ఉత్తీర్ణత 91 శాతం వచ్చినట్టు తెలిపారు. విద్యార్థులకు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

నా భూమి.. నా దేశం ర్యాలీ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు శుక్రవారం నా భూమి.. నా దేశం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులు భరతమాత, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ తదితర స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో అమృత కలశాన్ని చేత బట్టి నా భూమి.. నా దేశం అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.రత్నప్రభ పాల్గొన్నారు.

విరాళాలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునఃనిర్మాణం కోసం దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరికి చెందిన గిరిజాంబ, బాలకృష్ణ దంపతులు రూ.51,116, తిరుపతికి చెందిన దంపూరి లావణ్య భాస్కర్ దంపతులు రూ.లక్ష, విద్యానగర్‌కు చెందిన జయచంద్రారెడ్డి రూ.లక్ష ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి శుక్రవారం అందజేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేసిన రామచంద్రాపురం ఎస్ఐ గిరిబాబును సత్కరించారు. ఈఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



డాక్టర్ వెంకటరమణను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో వెంకటరమణ గుండె, మెటర్నటీ హాస్పిటల్ వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుండె సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వెంకటరమణను అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. స్త్రీల వైద్య నిపుణురాలు ఆర్.నిరుపమ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శుక్రవారం భవానీనగర్, జబ్బార్ లే అవుట్ వద్ద జరుగుతున్న రోడ్ల పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టీటీడీ పరిపాలనా భవనం ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న పెద్ద కాలువపై స్లాబ్ వేసి రోడ్డును విస్తరించనున్నట్లు చెప్పారు. అలానే తిలక్ రోడ్డు నుంచి జబ్బార్ లే అవుట్, మల్లయ్య గుంట వైపు 40 అడుగుల రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. దీంతో గంగమ్మగుడి వీధి- తిలక్ రోడ్డుకు కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్ రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో భూమన కృషి ఎనలేనిది

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇప్పించడంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషి ఎనలేనిదని టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీ ఉద్యోగులు ఇంటి స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూశారని తెలిపారు. భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేకచొరవ తీసుకొని సీఎంతో చర్చించి స్థలాలు కేటాయించారని తెలిపారు. తొలి విడతగా 3,518 మందికి పట్టాలు ఇప్పించారని, రెండో విడతలో 1700 మందికి స్థలాలు కేటాయించారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు సైతం స్థలాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈవో, జేఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవీంద్రబాబు, కోశాధికారి కామరాజ్, నాయకులు రామచంద్ర, అనురాధ, లోకనాథం, హేమకుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

- స్వయం ఉపాధి కల్పనకు సీఎం కృషి
- మేయర్ డాక్టర్ శిరీష
- మహిళలకు ఆర్థిక స్వావలంబన
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి



వాటాదారులకు డివిడెండ్లు అందజేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు, మెప్మా మిషన్ డైరెక్టర్, పీడీ

తిరుపతి తుడా: జగనన్నతోనే మహిళా సాధికారత సాధ్యమని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా మార్ట్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, మెప్మా పీడీ రాధమ్మతో కలిసి మేయర్ శిరీష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించి ఉత్పత్తులను పరిశీలించారు. మహిళా మార్ట్ ద్వారా వచ్చిన లాభాల్లో రూ.18,65,400 డివిడెండ్లను 37,308 మంది వాటాదారులకు చెక్ రూపంలో అందజేశారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వ్యాపారవేత్తలుగా చేయాలన్న లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీని రద్దు చేశారని, రుణమాఫీ హామీని సైతం నెరవేర్చకుండా మోసం చేశారని మండిపడ్డారు. రుణాల రికవరీలో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు. మహిళా మార్ట్ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సీఎం ఆదేశాలతో తొలి మహిళా మార్ట్‌ను తిరుపతిలో ఏర్పాటు చేశామని, ఏడాదిలో లాభాలబాటలో పయనించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం మహిళా, ఈ-మార్ట్‌లు, ఆహార క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల అడుగులు

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల్లో వచ్చే లాభాలను ఇతర రంగాల్లో పెట్టుబడులుగా పెట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. 40 వేల మంది సభ్యులు ప్రతి నెలా రూ.2 వేల చొప్పున ఈ మార్ట్‌ల్లో కొనుగోలు చేయాలని కోరారు. తద్వారా డీ-మార్ట్‌లతో పోటీ పడగలమని, ప్రతి నెలా రూ.8 కోట్ల వ్యాపారం చేయవచ్చన్నారు. ఏడాదికి రూ.96 కోట్లు లావాదేవీలు చేయడం ద్వారా అందులో కనీసం రూ.30 లక్షల వరకు లాభాలు పొందవచ్చన్నారు. రూ.150 మాత్రలమే పెట్టుబడి పెట్టి లక్షల్లో ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు కొటూరు ఆంజనేయులు, డాక్టర్ ఆరణి సంధ్య, కోటేశ్వరమ్మ, తాళ్ళూరి రత్నకుమారి, నాయకులు తాళ్ళూరి ప్రసాద్, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రజలు చైతన్యవంతులు కావాలి



రోడ్డు ఊడుస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: పరిసరాల శుభ్రతపై చైతన్యవంతులు కావాలని తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాకాలలో సర్పంచ్ ఎస్.కస్తూరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహిత్‌రెడ్డి చీపురుతో రోడ్డు ఊడ్చారు. పారిశుద్ధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో రాష్ట్రంలో పరిసరాల పరిశుభ్రతకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారని కొనియాడారు. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలిపారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, మునీర్, ఈఓ మోతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథంకు నివాళి

మొగరాల పంచాయతీ జంగాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, పంచాయతీ కన్వీనర్ భానుచందర్(అయ్యప్ప) తండ్రి జగన్నాథం(50) శుక్రవారం మృతి చెందారు. మోహిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తిరుపతికి తొలి టర్ఫ్ పిచ్ క్రికెట్ స్టేడియం



పనులను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరానికి త్వరలో టర్ఫ్ పిచ్‌తో కూడిన క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుందని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత తెలిపారు, ఆమె శుక్రవారం గొల్లవానిగుంటలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాలతో స్టేడియం నిర్మాణం చేపట్టామన్నారు. దాదాపు పనులు దాదాపు పూర్తయ్యాయని, పెండింగ్ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే గొల్లవానిగుంట బండ్ పై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, పేవ్‌మెంట్ పనులను పరిశీలించి రైలింగ్‌కు పెయింటింగ్ చేయించాలని సూచించారు. ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్ రెడ్డి, ఏఈకామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

భారీ కొండచిలువ



తిరుమల: స్థానిక బాలాజీ నగర్‌లోని నెం.816 ఇంటి వద్దకు శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ వచ్చింది. కుటుంబ సభ్యులు టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారం అందించారు. ఆయన భారీ దాన్ని పట్టుకున్నారు. దాదాపు 12 అడుగులకు పైగా పొడవున్న కొండచిలువను అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సహకారం అవసరం



మాట్లాడుతున్న జడ్జి రామచంద్రుడు

తిరుపతి లీగల్: కేసుల పరిష్కారంలో న్యాయవాదుల సహాయ సహకారాలు అవసరమని తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు తెలిపారు. ఆయన విజయవాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ పదోన్నతిపై తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయమూర్తి పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, 5వ అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటకుమార్, ఉపాధ్యక్షుడు గోపీచంద్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



వడ్డెర కార్పొరేషన్ చైర్ పర్సన్‌తో నేతలు

తిరుపతి కల్చరల్: పెరుమూరు మండలానికి చెందిన బాలికను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వడ్డెర కార్పొరేషన్ చైర్ పర్సన్ డిమాండ్ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల పర్యటనలో భాగంగా తిరుపతి వచ్చిన ఆమె శుక్రవారం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే.రోజా, నారాయణస్వామిని కలిసి బాలిక కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం ఆమెను శ్రీబాలాజీ వడ్డెర సంక్షేమ సంఘం నేతలు సత్కరించారు.

వైద్యులను నియమించండి

తిరుపతి కల్చరల్: స్విమ్స్‌లో వైద్యుల నియామకం చేపట్టాలని కోరుతూ ఏపీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పి.నారాయణ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమకే తలమానికమైన స్విమ్స్‌కు పలు ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారని తెలిపారు. కొన్ని విభాగాల్లో వైద్యుల కొరత కారణంగా రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయి రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి



సమావేశానికి హాజరైన నియోజకవర్గ నాయకులు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ మండల, డివిజన్ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల మండల అధ్యక్షులు వీరే..

తిరుపతి నియోజకవర్గం

తిరుపతి సిటీ-1 : వార్డులు 1 నుంచి 8, 10, 11 వరకు ఆదం సుధాకర్‌రెడ్డి

తిరుపతి సిటీ-2 : వార్డులు 12 నుంచి 24, 29 వరకు పద్మతికుమార్

తిరుపతి సిటీ -3 : వార్డులు -9, 23, 25 నుంచి 38 వరకు యాచం వాసూయాదవ్

తిరుపతి సిటీ-4 : వార్డులు - 34, 39 నుంచి 50 వరకు అప్పాను సురేంద్రరెడ్డి

చంద్రగిరి నియోజకవర్గం

తిరుపతి రూరల్ : దామోదర్‌రెడ్డి

పాకాల : నంగా నరేష్‌కుమార్‌రెడ్డి

చంద్రగిరి : కోట్ల చంద్రశేఖర్‌రెడ్డి

రామచంద్రాపురం : యద్దుల చంద్రశేఖర్

ఎర్రావారిపాలెం : దేవపతి నాగార్జునరెడ్డి

చిన్నగొట్టిగల్లు : కొండారెడ్డి

దేశభక్తిని పెంపొందించుకోవాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎంఈవో, టీచర్లు

చంద్రగిరి: ప్రతి విద్యార్థీ దేశభక్తితో పాటు జాతీయ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో లలితకుమారి తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల నుంచి అమృత కలశ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో చైతన్యం కలిగి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు లలిత, నిరంజన్, రామ్మూర్తి, రమేష్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా మహా చండీహోమం



పూర్ణాహుతి చేస్తున్న చైర్మన్, ఈవో, కమిటీ సభ్యులు, అర్చకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా మహా చండీ హోమం వేడుకగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి ఆలయ ఆవరణలోని హోమ మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా మహా చండీ హోమం చేపట్టారు. ఇందులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 8.45 నుంచి ప్రారంభమైన హోమం 11.45 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వరరావు, వి.క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

తాటి బెల్లం కాఫీ, ఐస్‌క్రీం, చిరుధాన్యాల రెస్టారెంట్ ప్రారంభం



తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని గంగారామ్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఏర్పాటు చేసిన తాటి బెల్లం కాఫీ, ఐస్‌క్రీం, చిరు ధాన్యాల ఆహార రెస్టారెంట్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా బిగ్‌బాస్ ఫేమ్, నటి ఇనయ సుల్తాన, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు జంక్ ఫుడ్, చక్కెరతో తయారు చేసిన కాఫీ తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. తాటి బెల్లంతో తయారు చేసిన కాఫీ, ఐస్ క్రీం, స్వీట్స్, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు తీసుకోవడం ద్వారా వాటికి చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రెస్టారెంట్ అధినేతలు ప్రశాంత్, మనోజ్ పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ సారథులుగా సెవెన్ హిల్స్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, వెంకటరమణ

రామచంద్రాపురం: మండలంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ-2020) సారథులుగా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు తెలిపారు. కళాశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌ఈపీ అమలులో విద్యార్థులను భాగస్వామ్యం చేసే లక్ష్యంతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఎన్‌ఈపీ సారథి అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తమ కళాశాలలో బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న జాహ్నవి, ఫార్మాడీ రెండో సంవత్సరం చదువుతున్న తిరుమల, అనూష ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక సభ్యుడు వెంకటరమణ అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

రక్తదానం ఆరోగ్యకరమైన అలవాటు

తిరుమల: రక్తదానం చేయడం ఆరోగ్యకరమైన అలవాటని టీటీడీ అశ్విని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి తెలిపారు. ఆసుపత్రిలో శుక్రవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కేసులపై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో శనివారం ఎస్సీ, ఎస్టీ కేసులపై డిగ్రీ, పీజీ విద్యార్థులు, సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సీఐడీ డీఎస్పీ ఎ.పద్మలత శుక్రవారం తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా స్థాయి న్యాయాధికారులు, రెవెన్యూ, సోషియల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, పోలీసు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

చైన్ స్నాచర్‌కు పది నెలల జైలు

తిరుపతి లీగల్: ఓ యువతి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసులో తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా వందవాసి తాలూకా మలయూర్‌కు చెందిన ఆర్.విజయ్ అలియాస్ విజయన్‌కు 10 నెలలు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఎ.మౌనిక గత ఏడాది నవంబరు 11న తిరుపతి రాయల్‌నగర్‌లో సెల్‌ఫోన్లో మాట్లాడుతోంది. నిందితుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని బంగారు చైనును లాక్కెళ్లాడు. ఎస్వీయూ పోలీసులు నిందితుడు విజయన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడు విజయన్‌పై పలు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

5 నుంచి న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపు వాడకం

తిరుపతి లీగల్: కోర్టుల్లో అక్టోబరు 5వ తేదీ నుంచి దాఖలయ్యే వివిధ పిటిషన్లకు రూ.20 విలువ చేసే న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపును అంటించాల్సి ఉంటుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా ప్రాంతాల న్యాయవాదుల అసోసియేషన్ సభ్యులు ఏపీ అడ్వొకేట్స్ వెల్‌ఫేర్ ఫండ్ పేరున బ్యాంకు అకౌంట్‌లో సొమ్ము జమ చేయాలని తెలిపారు. వివరాలకు 7661078840లో సంప్రదించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్‌రావు తెలిపారు.

హిందీభాష ప్రాముఖ్యతను గుర్తించండి

తిరుపతి సిటీ: హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తించడమే కాకుండా ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు హిందీ విభాగం అధ్యక్షులు ఎస్ఎస్ నారాయణరాజు తెలిపారు. హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 14 నుంచి శుక్రవారం వరకు పక్షోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం ముగింపు ఉత్సవాలు చేపట్టారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కమాండర్ చల్లా వెంకటేశ్వర్,ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, హిందీ విభాగం అధ్యక్షురాలు లతామంగేష్ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు.

సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం

తిరుపతి అర్బన్: సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహాలు ఇస్తోందని ఏపీ ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని మైక్రో ఇరిగేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని, తూర్పు మండలాల్లో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా సూక్ష్మ సేద్య అధికారి జి.సతీష్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఆధునికీకరించిన ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని శుక్రవారం వీసీ కె.రాజారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని కార్యాలయాన్ని ఆధునికీకరించామని, ఇక్కడ కంప్యూటర్ సౌకర్యంతో పాటు ప్రైవేటు, కాంట్రాక్ట్ ఉద్యోగాల సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు.

ఆర్థిక నేరాలు చేసి తప్పించుకు తిరిగిన బాబు

తిరుమల: చంద్రబాబు నాయుడు అనేక ఆర్థిక నేరాలు చేసి ఇంతకాలం తప్పించుకుని తిరిగారని ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సరైన విచారణ జరిగితే చంద్రబాబు మూడు జీవిత కాలాలు జైల్లో ఉంటారన్నారు.

నారాయణాద్రిలో విజయవంతంగా వంద వాస్కులర్ సర్జరీలు



తిరుపతి తుడా: ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో నాలుగు నెలల్లోనే డాక్టర్ పొందూరు త్రిలోక్ ఆధ్వర్యంలో వంద కార్డియోథొరాసిక్, వాస్కులర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) డాక్టర్ శ్రీధర్‌మునిని తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అతితక్కువ కాలంలో వంద ఓపెన్ హార్ట్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తి ఉచితంగా ఆపరేషన్లు చేసినట్టు చెప్పారు.

భూదేవి కాంప్లెక్స్‌లో స్వచ్ఛతాహి సేవ

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని కార్మిక రాజ్య బీమా సంస్థ ఉప ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు శుక్రవారం భూదేవి కాంప్లెక్స్‌లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్మిక రాజ్య బీమా సంస్థ ఉప ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ కె.రామకృష్ణ, ఉద్యోగులు, భూదేవి కాంప్లెక్స్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో యువకుడిపై దాడి

చంద్రగిరి: బీరు బాటిల్‌తో యువకుడు మరో యువకుడిపై దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చంద్రగిరి ప్రశాంతి నగర్‌కు చెందిన మునిరాజ కుమారుడు ముని గణేష్ శుక్రవారం పుట్టాలమ్మ ఆలయం వద్ద ఉన్నాడు. అదే సమయంలో రెడ్డివారిపల్లికి చెందిన సన్నీ, మరో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో అక్కడికి వచ్చి ముని గణేష్‌పై బీరు బాటిల్‌తో దాడి చేశారు. స్థానికులు అక్కడికి వచ్చేసరికి వారు పారిపోయారు. బాధితుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బాధితుడిని తిరుపతి రుయాకు తరలించారు.

ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ ఎంపిక

పాకాల : 29 ఆంధ్రా బెటాలియన్, తిరుపతి అధికారులు ప్రసాద్, సుక్సేస్‌సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 56 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ఎంపిక చేశారు. గత ఏడాది కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైందని, ఈ ఏడాది మొదటి బ్యాచ్‌ని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలోఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 28 మందికి ఉద్యోగాలు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 28 మంది ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. అపోలో ఫార్మసీకి 10 మంది, క్వెస్ కార్ప్ లిమిటెడ్‌కు 18 మంది ఎంపికై నట్లు వివరించారు. జేకేసీ సమన్వయకర్త ఎస్‌వీ.రమేష్‌కుమార్, అపోలో ప్రతినిధులు అల్లు వాసు, ఫ్లిప్‌కార్ట్ జి.మణిమేఘల, క్వెస్‌కార్ప్‌కు చెందిన వై.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.